కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 8 : నూతన ఆవిష్కరణలకు సంగారెడ్డి జిల్లా వేదిక కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదర్శించే నూతన ఆవిష్కరణల కోసం ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. విద్యాశాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు పాఠశాలలు, గ్రామాల్లో ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణుల ఆవిష్కరణలు, విద్యార్థుల ఆవిష్కరణలు, వ్యవసాయ రంగ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతో పాటు వివిధ ఆవిష్కరణలను ఆగస్టు 15న ప్రదర్శించాలని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు సంబంధించి రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన 4 ఫొటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషనల్ సెల్ వాట్సాప్ నంబరు 9100678543కు పంపాలని సూచించారు. పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, జిల్లా పేరు వివరాలతో ఆగస్టు 3లోగా పంపించాలని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజా రాణి, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా ప్రతినిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మీసేవలో అధికంగా డబ్బులు వసూలు చేయొద్దు

మాట్లాడుతున్న తహసీల్దార్ తెన్‌మోలీ

మునిపల్లి, జూలై 9 : మండల పరిధిలోని మీసేవ కేంద్రాల్లో అధికంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ తెన్‌మోలీ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మీ సేవ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మీ సేవ కేంద్రాలు ప్రజలకు ఎ ప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా మీ సేవలు నడిపిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే సంబంధిత మీ సేవ కేంద్రాలను సీజ్ చేస్తామన్నారు. మీ సేవకు సంబంధించిన సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, మీసేవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీకి చర్యలు

హెచ్ఎంలకు రాగిజావ ప్యాకెట్లను అందజేస్తున్న ఎంఈవో మారుతీ రాథోడ్

న్యాల్‌కల్, జూలై 8 : మండల పరిధిలోని ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో మారుతీరాథోడ్ అన్నారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలల హెచ్ఎంలకు రాగిజావ ప్యాకెట్లు, వర్క్‌బుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాగిజావను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత డిజిటల్ ఎక్స్‌రే శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొల్లారం జూలై 8 : క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం బొల్లారం పారిశ్రామిక వాడలోని ఉచిత ఎక్స్‌రే శిబిరాన్ని నిర్వహించారు. పారిశ్రామిక వాడలోని శ్రీకృష్ణ ఫార్మా లిమిటెడ్ యూనిట్-4 పరిశ్రమలో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న 202 మంది కార్మికులకు టీబీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనుమానిత కార్మికులకు చెందిన తెమడను పరీక్షల నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు పంపారు. అనంతరం పారిశ్రామికవాడలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. శిబిరంలో సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ దేవేందర్ రాజు, సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ నర్సిరెడ్డి, టీబీ అలర్ట్ ప్రతినిధులు, జిల్లా ఫీల్డ్ అధికారులు కృష్ణ శ్రీకాంత్, వైద్యాధికారి కార్తీక్, సూపర్‌వైజర్ సమీ, పరిశ్రమ హెచ్ఆర్, సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఖాజీపల్లి చెరువులోకి రసాయన వ్యర్థాలు

ఖాజీపల్లి జిల్లెల వాగు నుంచి పారుతున్న రసాయన వ్యర్థాలు

జిన్నారం, జూలై 8 : ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో రసాయన వ్యర్థాలు పారుతున్నాయి. సోమవారం జిల్లెల వాగునుంచి రసాయన వ్యర్థాలు ఖాజీ చెరువులోకి వచ్చాయి. ఖాజీపల్లి కాలుష్య నియంత్రణ పోరాట సమితి జేఏసీ చైర్మన్ దండే రమాకాంత్ కాలుష్య వ్యర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు శాంపిల్స్ సేకరించి రసాయన వ్యర్థాలు వదిలిన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవా లని వారు డిమాండ్ చేశారు.

ఎస్సై ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సామాజిక ఉద్యమకారులు

నారాయణఖేడ్, జూలై 8: ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సామాజిక ఉద్యమకారుడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత కొటారి నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణఖేడ్‌లో సామాజిక ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. చట్టాలను అమలు చేసే పోలీసు శాఖలోనే కుల వివక్ష వేధింపులు ఉండడం దారుణమన్నారు. కుల దురహంకార అధికారుల వ్యవహారశైలి మూలంగానే దళిత ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, సతీశ్, పోచయ్య, మహేందర్, రాజు, శంకర్, దేవిసింగ్, సంగమేశ్వర్, పరశురామ్, రమేశ్, గౌతమ్ పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సిద్ధం

- మొక్కలు నాటేందుకు ముమ్మర ఏర్పాట్లు
- నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేందుకు చర్యలు
- గుంతలు తీయిస్తున్న అధికారులు
- నర్సరీల్లో మొక్కలు సిద్ధం



మొక్కలు నాటేందుకు నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

న్యాల్‌కల్, జూన్ 8 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి ప్రభుత్వం హరిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2014-15లో తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఊరూరా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సం పేరుతో మొక్కలు నాటాలని నిర్ణయించింది. గత తొమ్మిది విడుతలుగా మొక్కలను నాటించగా ప్రస్తుతం పదో విడుత వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టేందుకు మండల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 99వేల మొక్కలు నాటాలనే లక్ష్యంగా నిర్దేశించారు. గత తొమ్మిదేండ్లుగా హరితహారంలో ఊరూరా 14 లక్షల మొక్కలు నాటారు. వాటిలో 10 లక్షల మొక్కలు బతికి ఉన్నాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వనమహోత్సవం మొక్కలను నాటేందుకు మండలంలోని ప్రతి పంచాయతీ నర్సరీలో మొక్కలను పెంచి సిద్ధం చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లోని వార్డుల్లో, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, రైతుల భూములు, గుట్టలు, ఇతర ప్రదేశాల్లో ఉపాధి హామీ ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలను తవ్విస్తున్నారు. ఆయా గ్రామాల్లో 40 వేల వరకు గుంతలు తవ్వి, 32 వేల వరకు మొక్కలను కూలీలతో నాటించారు. ఈ నెల ఆఖరులోగా మిగిలిన

మొక్కలు నాటేందుకు కూలీలతో గుంతలను తవ్విస్తున్న సంబంధిత శాఖాధికారులు

మొక్కలను నాటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత శాఖాధికారులు పేర్కొన్నారు.

గ్రామాల్లో మొక్కలు నాటాలి

కోహీర్, జూలై 8 : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలని ఎంపీడీవో భారతి ఆదేశించారు. సోమవారం కోహీర్ పట్టణంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. కొత్త స్థలాల్లో మొక్కలు నాటడంతో పాటు ఎండిపోయిన స్థానాల్లో మరోసారి నాటాలని సూచించారు. భారీ వర్షాలు కురిసిన వెంటనే తమకు నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్

కల్హేర్, జూలై 8: రైతులు సాగు చేసే పంటలకు సంబంధించిన మెళకువలు, సస్యరక్షణ, నూతన వంగడాలు, అధునిక పద్ధతులతో పాటు వివిధ అంశాలపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కల్హేర్ రైతు వేదికలో ప్రతి మంగళవారం అవగాహన కల్పించనున్నట్లు ఏవో శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన రైతు నేస్తం పథకం కింద రూ. 3లక్షలతో వీడియో కాన్ఫరెన్స్ కిట్‌ను రైతు వేదికలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం రైతు వేదికలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు సంతోశ, సతీశ్‌లు ఉన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణలకు ఆర్టీసీ బస్సు

- ఈ నెల 21న సంగారెడ్డి నుంచి ప్రయాణం
- ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్

సంగారెడ్డి, జూలై 8 : ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షణ చేయాలనుకునే భక్తులకు సంగారెడ్డి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని డిపో మేనేజర్ ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న అరుణాచల క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణలకు వెళ్లే భక్తులకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డీఎం స్పష్టం చేశారు. ఈ నెల 19న రాత్రి 6గంటలకు సర్వీస్ నంబర్ 92233 సంగారెడ్డి కొత్త బ స్టాండ్ నుంచి అరుణాచలం వయా హైదరాబాద్ మీదుగా వెళ్తుందన్నారు. 20న ఆంధ్ర ప్రదేశ్‌లోని కాణిపాకం విఘ్నేశ్వర స్వా మి దర్శనం, వేలూరులోని గోల్డెన్ టెంపుల్ చేరుకుని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దర్శనం అనంతరం రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలేశ్వర స్వా మి గిరిప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఈ నెల 21న సాయంత్రం 5 గంటలకు బ యలుదేరి 22న ఉదయం అలంపూర్ జోగులంబ అ మ్మవారి శక్తిపీఠం సన్నిధికి చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం 5 గం టలకు సంగారెడ్డికి తిరిగి వస్తుందన్నారు. ఈ ప్యాకేజీకి రూ.4,100 చెల్లించాలన్నారు. ఈ సదుపాయాన్ని కావాలకునేవారు సంస్థ అధికారిక వెబ్‌సైట్ టీజీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ డాట్‌ఇన్‌లో సర్వీస్ నంబర్ 92233ను ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాకు చెందిన ప్రజలు, ప్రయాణికులు తమ ప్రాంతాలకు దగ్గరలోని బస్టాండ్ టీజీఎస్ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చన్నారు. ప్యాకేజీ సమాచారం కోసం 9959226267, 7382831381, 9398690602, 7382831275 నంబర్లను సంప్రదించాలని డీఎం కోరారు.

నారాయణఖేడ్ నుంచి..

నారాయణఖేడ్, జూలై 8 : ఈ నెల 21న గురుపౌర్ణమిని పురస్కరించుకుని నారాయణఖేడ్ నుంచి అరుణాచలానికి ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. తమిళనాడులోని అరుణాచల శైవక్షేత్రంలో గిరిప్రదక్షిణ చేసే భక్తుల కోసం బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19న సాయంత్రం 4 గంటలకు నారాయణఖేడ్ నుంచి బస్సు బయలుదేరి 20న కాణిపాకం, వేలూరు, గోల్డెన్ టెంపుల్‌లను దర్శించుకుని అదే రోజు సాయంత్రం వరకు అరుణాచలం చేరుకొంటుందని తెలిపారు. 21న అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, దర్శనం పూర్తి చేసుకుని సాయంత్రం జోగులాంబ శక్తిపీఠాన్ని దర్శించుకుని 22న తిరిగి నారాయణఖేడ్‌కు చేరుకొంటుందన్నారు. ఇందుకు రూ.4,300ల ప్రయాణ చార్జీ చెల్లించి ముందుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని నారాయణఖేడ్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యాధుల నివారణకు పరిసరాల శుభ్రతే ముఖ్యం

ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బొల్లారం, జూలై 8 : సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బొల్లారం పీహెచ్‌సీ అధికారి రాధిక సూచించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ, కేబీఆర్ కాలనీల్లో ఆరోగ్య కేంద్ర సిబ్బందితో కలిసి డెంగీ, మలేరియా, అతిసార వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్రం, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షపర్లు, క్వారీల పరిశీలన

మాదారం పరిధిలోని కంకర క్షపర్లు, క్వారీలను పరిశీలిస్తున్న పీసీబీ అధికారి అజయ్

జిన్నారం, జూలై 8 : మాదారం గ్రామ పరిధిలోని కంకర క్షపర్లు, క్వారీలను పీసీబీ అధికారి అజయ్ సోమవారం పరిశీలించారు. క్షపర్లు, క్వారీ పేలుళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటిని శాశ్వతంగా మూసి వేయాలని గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పీసీబీ అధికారి పరిశీలించి గ్రామస్తులు చెప్పిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

దాదిగూడ గ్రామాన్ని కాపాడండి

రాళ్లకత్వ గ్రామ పరిధిలోని కంకర క్వారీ పేలుళ్లతో దాదిగూడెం గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ పేలుళ్లపై తక్షణమే చర్యలు తీసుకొని గ్రామాన్ని కాపాడాలని గ్రామ యువకులు జిన్నారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అప్పగించాలి

హోతి(కే)లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోహీర్, జూలై 8 : హోతి(కే) గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం బృందం ఆధ్వర్యంలో హోతి(కే)లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేసిందని తెలిపారు. అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయించి వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బక్కన్న, తిరుపతి, రాజు, యాదుల్, తదితరులున్నారు.

హోమియో మందుల వాడకంపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త బాల్‌రెడ్డి

వట్‌పల్లి, జూలై 8 : ప్రకృతి వ్యవసాయ హోమియో మందుల వాడితే కలిగే ప్రయోజనాలను వ్యవసాయ శాస్త్రవేత్త బాల్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం వట్‌పల్లి మండలం పోతులబోగుడలో రైతులకు హోమియో మందుల వాడకంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి ద్వారా లభించే హోమియో మందులను వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే పంటలకు రోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు.

రివైజ్ ప్రీ స్కూల్‌పై శిక్షణా తరగతులు

అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు

న్యాల్‌కల్, జూలై 8 : మండల కేంద్రంలోని రైతు వేదిక, ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లకు నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా రివైజ్డ్ ప్రీ స్కూల్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు అనిత, రాధమ్మ మాట్లాడుతూ.. చిన్నారుల్లో గుణాత్మక మార్పును తీసుకొచ్చేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలోఆయా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

బోధనను పరిశీలిస్తున్న ఎంఈవో శంకర్

కోహీర్, జూలై 8 : విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని మద్రి, గురుజువాడ, బిలాల్‌పూర్, గొటిగార్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రీధర్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, ప్రసాద్‌రావు, ఉమాదేవి, సురేశ్ ఉన్నారు.

పంటల రుణ పరిమితి పెంచాలి

సంగారెడ్డి, జూలై 8 : పంటల రుణ పరిమితి పెంచాలని, కొత్త రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం నాయకుడు జయరాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని లీడ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రఘుకు వినతిపత్రం అందజేశారు. రైతులకు రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు నర్సింహ రెడ్డి, రాజయ్య, భూషణం, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పైప్‌లైప్‌ను సరి చేయిస్తాం

కార్పొరేటర్‌కు సమస్యలు చెబుతున్న కాలనీవాసులు

రామచంద్రాపురం, జూలై 8 : డ్రైనేజీ పైప్‌లైన్‌ని సరిచేయించి సమస్యలు తలెత్తకుండా చూస్తామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. సోమవారం ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 12వ బ్లాక్‌లో ఆమె అధికారులతో కలిసి బస్తీదర్శన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో నూతనంగా వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ సరిగ్గా లేకపోవడంతో ఇండ్లలోకి డ్రైనేజీ నీరు చేరుతుందని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు చెప్పారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ వెంటనే డ్రైనేజీ పైప్‌లైన్‌ని సరిచేయిస్తామని తెలిపారు. త్వరలోనే సీసీ రోడ్డు కూడా వేయిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, నాగులుగౌడ్, లక్ష్మణ్, ఎల్వర్తి మల్లేశ్, నర్సింహ, కృష్ణగౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ

హత్నూర, జూలై 8 : మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మాదిగల ఆత్మగౌరవ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్రమాదిగ మాట్లాడుతూ మాదిగల హక్కులకోసం ఎమ్మార్పీఎస్ గత 30ఏండ్లుగా పోరాటం చేస్తుందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పుట్టినరోజును పురస్కరించుకొని గ్రామాల్లో మాదిగల ఆత్మగౌరవ జెండా పండుగలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షుడు మీనంపల్లి సురేశ్, నాయకులు కిషన్‌రావు, వీరయ్య, ప్రసాద్, నరేందర్, అరవింద్, గనేశ్, శ్రీకాంత్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు ఖాతాలో బ్యాలెన్స్ సరి చూసుకోవాలి

న్యాల్‌కల్, జూలై 8 : మండల పరిధిలోని హద్నూర్ తపాలా శాఖలో ఖాతాదారులు తమ అకౌంట్‌లో బ్యాలెన్స్‌ను సరి చూసుకోవాలని జహీరాబాద్ తపాలా శాఖాధికారి రఘువీర్ సూచించారు. సోమవారం స్థానిక పోస్టాఫీసును సందర్శించిన సందర్భంగా ఆయన పలువురు ఖాతాదారులతో మాట్లాడారు. స్థానిక పోస్టాఫీస్‌లోని ఖాతాదారుల అకౌంట్లను పరిశీలించగా లావాదేవీలకు సంబంధించి బ్యాలెన్స్‌లో తేడాలను గుర్తించామన్నారు. ఖాతాదారులందరూ తప్పనిసరిగా ఖాతా పుస్తకాలను తీసుకొచ్చి అకౌంట్‌లో బ్యాలెన్స్‌ను సరి చూసుకోవాలని కోరారు.

హెచ్ఎంకు సన్మానం

కోహీర్, జూలై 8 : మండల పరిధిలోని మనియార్‌పల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా వెంకటేశ్వర్‌రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హెచ్ఎంను సన్మానించారు. ఆయన కోహీర్ పాఠశాల నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం అర్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మునిపల్లి, జూలై 8 : మండల పరిధిలోని మగ్దుంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

పుల్కల్, జూలై 8 : ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని పుల్కల్, బస్వాపూర్, ముదిమాణిక్యం, పోచారం గ్రామాల మాజీ సర్పంచులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో జోగిపేట నుంచి బస్వాపూర్, పుల్కల్ మీదుగా పోచారం గ్రామానికి ఆర్టీసీ బస్సు వస్తుండేదని, కొన్ని నెలల నుంచి బస్సును నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన డీఎం రోడ్డును పరిశీలించి బస్సును నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచులు శ్రవణ్ కుమార్, సంగప్ప విష్ణయ్య, అరుణ యాదగిరి, స్వాతి కనకారెడ్డి ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సిర్గాపూర్, జూలై 8 : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అంగర్గాంలో జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాములు కుమారుడు సుభాష్ (30) ఆదివారం శివారులోని వాగులో చేపలు పడుతుండగా విద్యుత్ వైర్లు తాకడంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆర్టీసీ టెండర్ల ప్రక్రియను నిలిపివేయాలి

సంగారెడ్డి, జూలై 8 : సంగారెడ్డి బస్సు డిపో పరిధిలోని ఖాళీ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు టెండర్లను ప్రకటించి ఈ నెల 2న కేటాయించిన విషయమై టెండర్లను నిలిపివేయాలని పలువురు దుకాణదారులు కోరారు. సోమవారం ఈ విషయమై ఆర్ఎంకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లారు. ఆర్ఎం లేకపోవడంతో కార్యాలయ గోడకు